నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 24 మే 2024 | SURYAPET

48గంటల ముందు ఎన్నికల ప్రచారం ముగించాలి

- జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, మే 23 : శాసనమండలి పోలింగ్‌కు 48 గంటల ముందు ఈ నెల 25న సాయంత్రం 4 గంటలకు ప్రచారాన్ని ముగించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నందున 48 గంటల ముందు నుంచి ఎలాంటి ప్రచారం చేయవద్దని ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని, ఎన్నికల విషయాలను టీవీలు, ఇతర మాధ్యమాల్లో ప్రదర్శించకూడదని తెలిపారు. ఓటర్లను ఆకర్షించడం వంటివి చేయరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 126వ సెక్షన్‌ను తు.చ, తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఇతర ప్రాంతాల వారు నియోజకవర్గంలో ఉండకుండా చూడాలని సూచించారు. ఎమ్మెల్సీ నియోజకవర్గం, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

నేడు జిల్లాకు కేటీఆర్

నకిరేకల్, మునుగోడు, దేవరకొండలో పర్యటన

ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

రేపటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నల్లగొండ ప్రతినిధి, మే 23 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని నకిరేకల్, మునుగోడు, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పట్టభద్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో జరుగనున్న సమావేశాల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ పాల్గొననున్నారు. పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 11 గంటలకు నకిరేకల్‌లోని సువర్ణ గార్డెన్స్‌లో మీటింగ్‌కు హాజరవుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు మునుగోడు నియోజకవర్గం పరిధిలోని చౌటుప్పల్ మండలం దామెరలోని బాలాజీ గార్డెన్స్‌లో సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3గంటలకు దేవరకొండలోని సాయిశివ ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి కేటీఆర్ హాజరు కానున్నారు.

రాకేశ్‌రెడ్డి గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ఉమ్మడి జిల్లాలోని పార్టీ యావత్తు రంగంలోకి దిగింది. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఆది నుంచీ బీఆర్ఎస్‌దే విజయం. ప్రస్తుత ఉప ఎన్నికల్లోనూ మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలన్న పట్టుదలతో పార్టీ శ్రేణులంతా కృషి చేస్తున్నాయి. ఇప్పటికే కేటీఆర్ మార్గదర్శనంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు పూర్తి చేశారు. కేటీఆర్ కూడా దాదాపు అన్ని నియోజకవర్గాలను చుట్టివస్తూ పట్టభద్రులు, పార్టీ కార్యకర్తలతో సమావేశాల్లో పాల్గొని దిశానిర్దేశం చేస్తున్నారు. మండలాల వారీగా బూత్ కమిటీలు సైతం ఏర్పాటు చేసి గ్రామాల వారీగా ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లుతున్న విధానాలను వివరిస్తుండడంతో మంచి స్పందన లభిస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న వ్యవహారశైలిని, దుర్మార్గాలను, దందాలను ఎత్తిచూపడంతోపాటు కేసీఆర్ ప్రభుత్వ విజయాలను, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి వ్యక్తిత్వం గురించి చెప్తున్నారు. దీంతో బీఆర్ఎస్ ప్రచారానికి పట్టభద్రుల నుంచి ఆదరణ లభిస్తుంది. నియోజకవర్గాల వారీగా కేటీఆర్ ప్రచారం మరింత ఊపునిస్తుంది.

రేపటితో ప్రచారం బంద్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగియనుంది. ఈ నెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుండగా.. నిబంధనల ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు ప్రచారం బంద్ చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ నెల 25న సాయంత్రం 4గంటల వరకే ప్రచారానికి గడువు మిగిలి ఉంది. ఆ తర్వాత ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదు. దీంతో శుక్ర, శనివారాల్లో ప్రచారం మరింత ఉధృతంగా సాగనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- కాంగ్రెస్, బీజేపీ యువతను మోసగించిన పార్టీలే..
- యువతలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది
- బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చందంపేట (దేవరకొండ), 23 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. దేవరకొండలో గురువారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బూత్ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ యువతను మోసగించిన పార్టీలే నన్నారు. యువతలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి డిపాజిట్లు కూడా దక్కవని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నా ప్రజల్లో మాత్రం లేనట్లేనని, ఎన్నికల్లో మాత్రమే కనిపించి ఆ తర్వాత కనపడరని ఎద్దేవా చేశారు. విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం దెబ్బతిన్నదన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. మాయ మాటలకు మోసపోకుండా ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని యువతను కోరారు. సమావేశంలో డిండి ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు, పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా పర్వత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, నాయకులు దస్రూనాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, వల్లపురెడ్డి, తిరుపతయ్య, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మోత్కూరులో పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, పక్కన ఎన్నికల సమన్వయ కర్త గోలి శ్రీనివాస్‌రెడ్డి

పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి

- నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే
- మోసపూరిత వాగ్దానాలు చేసిన రేవంత్‌కు గుణపాఠం చెప్పాలి
- విద్యావంతుడు రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, మే 23 : పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని, ప్రజా గొంతుక, విద్యావంతుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. గురువారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో నిర్వహించిన పట్టభద్రులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి ఐదు నెలల పాలనలో 20 వేల కోట్ల అప్పులు చేశాడన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పాటు పడి నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అంటూ దొంగ మాటలు చెప్పి మోసం చేశాడన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకొనేందుకు సిగ్గుండాలన్నారు. క్వింటా వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ఇప్పుడు 5 గ్యారెంటీలు అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన వాళ్లకు ఓటేద్దామా...? పదేండ్లపాటు నిజాయితీగా పని చేసిన కేసీఆర్ అభ్యర్థి, విద్యావంతుడు రాకేశ్‌రెడ్డికి ఓటేద్దామా? అని అన్నారు. బ్లాక్ మెయిలర్ తీన్మార్ మల్లన్నకు తగిన గుణపాఠం చెప్పేందుకు పట్టభద్రులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త గోలి శ్రీనివాస్‌రెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకూబ్‌రెడ్డి, తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేందర్‌నాథ్, మర్రి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బోనస్‌పై మాట తప్పిన సర్కారు

₹ ప్రభుత్వ నిర్ణయంతో సూర్యాపేట జిల్లా రైతులకు దక్కని రూ.250 కోట్లు

- సూర్యాపేట జిల్లాలో 2,08,661 ఎకరాల్లో దొడ్డు ధాన్యం సాగు
- వానకాలం దిగుబడి 5,00,815 మెట్రిక్ టన్నులు
- 3,82,518 మెట్రిక్ టన్నుల ఫైన్ వెరైటీకే రూ.500 బోనస్ ఇస్తామంటున్న సర్కారు
- సర్కారు నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సూర్యాపేట, మే 23 (నమస్తే తెలంగాణ) : ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు నమ్మబలికిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే దోఖాబాజీ తనాన్ని ప్రదర్శించింది. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జిల్లా వ్యాప్తంగా 3,82,533 ఎకరాల్లో వచ్చిన తొలి పంటకు బోనస్ ఇవ్వాల్సి ఉండగా.. సన్న రకాలకు మాత్రమే ఇస్తామని ప్రకటించిన విషయం విదితమే. దాంతో జిల్లాలో 2,08,661 ఎకరాల్లో రైతులు సాగు చేసిన దొడ్డు రకం ధాన్యానికి బోనస్ అందని పరిస్థితి నెలకొంది. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లాలో 3,82,518 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం దిగుబడి కాగా, దీనికి రూ.250 కోట్లు బోనస్ ఇవ్వాల్సి ఉన్నది. వాస్తవానికి యాసంగిలో అత్యధికంగా దొడ్డు రకం ధాన్యం సాగు చేస్తుండగా ఈ సీజన్‌లో దాదాపు 55 శాతంగా నమోదైంది. సన్నాలకు బోనస్ ఇచ్చి దొడ్డు రకాలకు ఇవ్వకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అలవికాని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఐదు నెలలు గడుస్తున్నా వాటి అమలుకు చిత్తశుద్ధి చూపించడం లేదు. దశాబ్దాల తరబడి కరువు, కాటకాలతో అల్లాడిన తెలంగాణ ప్రాంతం పదేండ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలతో పచ్చగా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్ మరేదో ఇస్తామని చెప్పడంతో ఆశపడి ఆ పార్టీని గెలిపించిన ప్రజలు.. ఇప్పుడు ఎందుకు గెలిపించామా? అని బాధపడుతున్నారు. ఐదు నెలల్లోనే సాగు నీళ్లు బంద్, విద్యుత్ కోతలతో సతమతం కాగా, తీరా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో సెంటర్ల వద్ద రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో వ్యాపారులకు తక్కువ ధరకే తెగనమ్ముకున్నారు. ఇక రైతాంగానికి బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో అది వస్తుందని ఆశపడ్డ రైతాంగానికి నిరాశే మిగిలింది.

55శాతం పంటకు బోనస్ పాలుకే..

జిల్లాలో 3,82,518 ఎకరాల్లో వరి సాగు చేశారు.. ఇందులో పండించిన 45 శాతం సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనుండగా.. మిగిలిన 55 శాతం పంటకు బోనస్ దక్కని పరిస్థితి. సన్న రకం ధాన్యానికే బోనస్ ఇస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాలో 1,73,872 ఎకరాల్లో 1,10,121 మంది రైతులు ఫైన్ వెరైటీ ధాన్యం పండించగా.. వ్యవసాయ శాఖ అధికారిక లెక్కల ప్రకారం ఎకరానికి 2.2 మెట్రిక్ టన్నుల చొప్పున 3,82,872 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. క్వింటాలుకు రూ.500 చొప్పున సన్న ధాన్యం పండించిన రైతాంగానికి బోనస్‌గా రూ.191.40 కోట్లు అందనుంది. కాగా, 1,17,545 మంది రైతులు 2,08,661 ఎకరాల్లో దొడ్డు రకాలు సాగు చేయగా.. ఎకరానికి 2.4 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 5,00,815 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయ్యింది. క్వింటాకు రూ.500 చొప్పున రూ.250 కోట్లు బోనస్ రూపంలో రైతులకు అందాల్సి ఉన్నది. కానీ.. ప్రభుత్వ నిర్ణయంతో దొడ్డు రకం ధాన్యం పండించిన రైతులకు అన్యాయం జరుగనుంది. దీనిపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని రకాల ధాన్యానికి బోనస్ అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు సన్న రకాలకు మాత్రమే ఇస్తామని ప్రకటించడం సరికాదు. కొన్ని భూములు సన్న రకానికి అనుకూలంగా ఉండవు. కాబట్టి దొడ్డు రకం వడ్లనే పండిస్తాం. సర్కారు నిర్ణయంతో దొడ్డు రకం పండిచిన రైతులకు నష్టం జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి సన్న రకంతోపాటు దొడ్డు రకం వడ్లకు కూడా రూ.500 బోనస్ చెల్లించాలి. లేకుంటే రైతుల మంతా అదోళన చేపడుతాం.

– సోమిరెడ్డి పెద్ద వెంకట్‌రెడ్డి, రైతు, ఆత్మకూర్ (ఎస్)

మాట తప్పిన కాంగ్రెస్‌పై పోరాటం తప్పదు

యాసంగి వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. తీరా పంట చేతికొచ్చిన తరువాత మాట మార్చడం తగదు. సన్నాలకు మాత్రమే చెల్లిస్తామని తమ మోసపూరిత తత్వాన్ని మరోసారి రుజువు చేస్తూ రైతులను మోసం చేసింది. యాసంగిలో సాగు చేసిన అన్ని రకాల పంటలకు బోనస్ చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం తప్పదు.

– పుట్ట కిరణ్, రైతు, గణపవరం, (కోదాడ రూరల్)

నేటి సన్నాహక సమావేశానికి పట్టభద్రులు తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రాంబాబు యాదవ్

నకిరేకల్, మే 23 : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి పట్టభద్రులు భారీ సంఖ్యలో తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి రాంబాబు యాదవ్ పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 27న జరుగనున్న వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని మూసీ రోడ్డులో ఉన్న సువర్ణ గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు పట్టబద్రుల ఓటర్లతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టభద్రులు, మేధావులు, విద్యావంతులు, బీఆర్ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు, బూత్ ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు యాదగిరి, సదానందం, ప్రభాకర్, పరమేశ్ పాల్గొన్నారు.

సజావుగా టీఎస్ ఎడ్‌సెట్

- నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నాలుగు పరీక్ష కేంద్రాలు
- 102 మంది విద్యార్థులు గైర్హాజరు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నాలుగు ఆన్‌లైన్ కేంద్రాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 1100 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 998 మంది హాజరయ్యారు. 102 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు నిర్వాహకులు వెల్లడించారు.

నల్లగొండలో అభ్యర్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న ప్రత్యేక పరిశీలకుడు రామకృష్ణ, సీఎస్ నీలంరెడ్డి

నల్లగొండలోని ఎస్‌పీఆర్ పాఠశాల ప్రాంగణంలోని డీపీఎంఎస్ ఆన్‌లైన్ కేంద్రంలో పరీక్షలను టీఎస్ ఎడ్‌సెట్ ప్రత్యేక పరిశీలకుడు, నల్లగొండ డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి రామకృష్ణ పర్యవేక్షణ చేశారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి ఉన్నారు.

సూర్యాపేట శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో పరీక్షలను టీఎస్ ఎడ్‌సెట్ పరిశీలకుడు, నల్లగొండ డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ బి.నారాయణరెడ్డి, కోదాడలోని సనా ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో సూర్యాపేటలోని ఆర్‌కేఎల్‌కే బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందుర్తి రజిని, మధిర ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలకుడు సైదులు పర్యవేక్షణ చేశారు. నల్లగొండలో ఒక విద్యార్థి 15 నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్ష కేంద్రంలోకి అధికారులు అనుమతించలేదు. నల్లగొండలో 360 మంది విద్యార్థులకుగాను 331 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. సూర్యాపేటలో 400 మందికిగాను 367 మంది హాజరు కాగా, 33మంది గైర్హాజరయ్యారు. కోదాడలో 340 మందికిగానూ 300 మంది హాజరయ్యారు. 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రామగిరి, మే 23 : తెలంగాణలో రెండేండ్ల బీఈడీ కోర్సులో ప్రవేశానికి మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గురువారం 79 కేంద్రాల్లో సీబీటీ (కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) విధానంలో నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్ – 2024 సజావుగా సాగింది.

నేడు టీఎస్ పాలీసెట్

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

రామగిరి, మే 23 : తెలంగాణలో పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ పాలీసెట్ – 2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం జరుగనుంది. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని పరీక్షల జిల్లా కన్వీనర్, నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి తెలిపారు. జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 3,842 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

నల్లగొండలోని నీలగిరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, మే 23 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ చందనాదీప్తి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చే వారు అనుమతి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కొంత మంది దళారులు, మధ్యవర్తులు ఎక్కువ సిమ్ కార్డులు కొని ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని అత్యవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను ఆన్‌లైన్‌లో ఎవరి పేరు మీద బుక్ చేసుకుంటే అక్కడే సరఫరా చేయాలని ఆదేశించారు. ఇసుక ట్రాక్టర్లను రోడ్లపై ఆపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి వారిపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు.



కలెక్టరేట్‌లోని ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక

పోస్టల్ బ్యాలెట్‌కు నేడు ఆఖరు

సూర్యాపేట, మే 23 : పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు శుక్రవారం సాయంత్రం 4గంటల వరకు అవకాశం ఉన్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి గురువారం ఆయన సందర్శించి, పోలైన ఓట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో 182 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని సిబ్బంది చెప్పారు.

ఎన్నికల రోజు విధుల్లో ఉండే వారికి ఈ అవకాశం ఇవ్వడం జరిగిందని, ఓటు వేయని వారు శుక్రవారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటు వేయాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఏఓ సుదర్శన్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.